

ప్రజా రక్షణ భేరిని జయప్రదం చేయాలి

పోలవరం:వచ్చే నెల ఆరో తేదీన పోలవరంలోకి ప్రవేశించనున్న ప్రజా రక్షణ భేరి బస్సుయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన మండల విస్తృత సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి ప్రజాద్రోహులుగా నిలుస్తున్నారని, మతోన్మాద బిజెపి రాష్ట్రానికి అన్యాయం చేసినప్పటికీ రాష్ట్రంలో ఉన్న అధికార ప్రతిపక్ష పార్టీలు బిజెపి చంకలో పిల్లలుగా మారాయన్నారు. పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు రామకృష్ణ మాట్లాడుతూ ఆరో తేదీ సాయంత్రం నాలుగు గంటలకు మండల కేంద్రానికి యాత్ర చేరుకుంటుందని తెలిపారు. 15వ తేదీన విజయవాడలో జరుగుతున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని, రానున్న ఎన్నికల్లో బిజెపి దాని మిత్ర కూటమి పార్టీలను ఓడించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు, మండల కమిటీ సభ్యులు బోరగం భూ చంద్రరావు, మిడియం గంగాదేవి, సముద్రాల సాయి కృష్ణ కొట్టెం రాజు, కృష్ణ పాల్గొన్నారు.

జగన్ ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి

మున్సిపల్, కలెక్టర్ కార్యాలయాల వద్ద మున్సిపల్ ఉద్యోగుల ధర్నా



ఏలూరులో..

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మున్సిపల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సిఎం జగన్ ఎన్నికల హామీని అమలు చేయాలని కోరుతూ మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు శనివారం ఏలూరు నగరపాలక సంస్థ వద్ద పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నుండి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ కూడా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చి దానికి భిన్నంగా నేడు పది వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను మాత్రమే పర్మినెంట్ చేసి మూడు లక్షల 40 వేల మందిని గాలికి వదిలేశారన్నారు. వైసిపి ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇస్తానన్న హామీని సైతం తుంగలో తొక్కారని విమర్శించారు. పిఆర్‌సి ప్రకారం కనీస వేతనం రూ.20వేలు రావాల్సి ఉండగా రూ.15 వేలకే జిఒ ఇచ్చి నెలకు రూ.ఐదు వేలు చొప్పున కోత కోశారన్నారు. అన్ని రకాలుగా మున్సిపల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను సిఎం జగన్ నట్టేట ముంచారన్నారు. వైసిపి ప్రభుత్వం, సిఎం జగన్ మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు(ఆప్కాస్) ఇచ్చిన హామీని అమలు చేయాలని, వాగ్దాన భంగానికి పాల్పడొద్దని, మాట తప్పని మడమ తిప్పని సిఎం అని నిరూపించుకోవాలని ఆయన హితవు పలికారు. లేని పక్షంలో రానున్న కాలంలో ఆందోళన మరింత ఉధృతం చేసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేసే వరకూ పోరాడుతామన్నారు. ఇంకా ఈ కార్యక్రమం ఉద్దేశించి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి పనిచేస్తే దేవుళ్లని చెప్పి పొగిడిన సిఎం నేడు కార్మికుల సమస్యలను పట్టించుకోవడంలేదని, శ్రమకు తగ్గ ఫలితం ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి మున్సిపల్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని, లేదా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలలో పని చేస్తున్న వేలాదిమంది కార్మికులు పెరిగిన ధరలతో కుటుంబ పోషణ కష్టమై, కరెంటు ఛార్జీలు, ఇంటి అద్దెలు కట్టుకోలేక చాలీచాలని జీతాలతో బతుకుతున్నారన్నారు. మున్సిపల్ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షులు లేటి కృష్ణారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పంతం చిన్న నాగరాజు, తానంకి జార్జి, బంగారు వెంకటేశ్వరరావు, బండి రాజు, కె.మరియన్న, జి.అప్పన్న, నరమామిడి నాగమణి, మేతర పాప నాయకత్వం వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు, జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు. వందలాది మంది మున్సిపల్ కార్మికులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

నూజివీడు : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఎం జగన్ వాగ్దానాల ఉల్లంఘనను నిరసిస్తూ - సిఐటియు ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.జయలక్ష్మి, రజని, ఏడుకొండలు, సిఐటియు నూజివీడు పట్టణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఆర్.హనుమానులు, జి.రాజు పాల్గొన్నారు.



నూజివీడులో..

విద్యుత్ భారాలను ఉపసంహరించాలని ధర్నా



ట్రాన్స్‌కో అధికారికి వినతిని అందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - నిడమర్రు

విద్యుత్ భారాలను ప్రభుత్వం విరమించుకోవాలని కోరుతూ సిపిఎం, సిఐటియు ఆధ్వర్యాన బువనపల్లి విద్యుత్‌సబ్ స్టేషన్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. రైతు సంఘం నాయకులు కోన శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పిన వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందన్నారు. గతంలో వాడిన కరెంటుకు అదనపు ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీ పేరుతో అదనపు ఛార్జీలు వసూలు చేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లు-2020ను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో 2000లో జరిగిన విద్యుత్ పోరాటం గత ప్రభుత్వాన్ని గద్దె దింపిన విషయాన్ని గుర్తించుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో గవర సత్యనారాయణ, లావేటి సొంబాబు, ముసుగాలి నరసింహామూర్తి, కామారు రాజు, కమిలి నాని, ఎ.వినయ్, తుంగ దుర్గాప్రసాద్, పిల్లా సూరిబాబు పాల్గొన్నారు.


ఉంగుటూరులో రైల్వే వంతెన నిర్మాణానికి చర్యలు



వంతెన ప్లానింగ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు రైల్వే గేటు మీదుగా రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి గతి శక్తి స్కీమ్ (పిఎంజిఎస్)లో భాగంగా ఆధునీకరణ మౌలిక సదుపాయాల కల్పన పేరుతో రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద రద్దీని నియంత్రించేందుకు ఆర్‌ఓబిలను నిర్మించనున్నారు. ఈ క్రమంలో ఉంగుటూరు రైల్వే గేటు మీదుగా టి - ఆకారంలో వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఉంగుటూరు రైల్వే గేటు నుంచి సింగరాజుపాలెం దిశ వెళ్లే మార్గంలో 500 మీటర్లు, అలాగే జాతీయ రహదారి వెంబడి స్థానిక టి కార్నర్ సెంటర్ నుంచి పశువుల ఆసుపత్రి వరకూ సుమారు కిలో మీటరు దూరం వరకూ వంతెన నిర్మాణం చేయనున్నట్లు ప్రాథమిక సమాచారం. ఈ క్రమంలో ఈ మార్గంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించాల్సి ఉంది. వాటిని తొలగించేందుకు నివేదిక తయారు చేయాలని ఆర్‌అండ్‌బి అధికారులను, విద్యుత్ అధికారులను కోరారు. దీంతో నారాయణపురం విద్యుత్ ఎఇ శ్రీరామ్ ఆర్‌ఓబి నిర్మించే స్థలం అలైన్‌మెంట్‌లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర లైను మార్గాలను షిఫ్టింగ్ చేసేందుకు ఎస్టిమేషన్ వేసేందుకు ఫీల్డ్ సర్వే చేశారు. విద్యుత్ లైన్‌మెన్ నాగరాజు, ఆర్‌అండ్‌బి సిబ్బంది నెక్కల శ్రీను పాల్గొన్నారు. సుమారు 80 నుంచి 85 వరకూ స్తంభాలు, ఐదు నుంచి ఎనిమిది ట్రాన్స్‌ఫార్మర్లు షిఫ్టింగ్ చేయాల్సి ఉంటుందని ప్రాథమిక అంచనా, పూర్తి వివరాలు రెండు మూడు రోజుల్లో వెల్లడిస్తామని ఎఇ చెప్పారు.



ఎంఎల్‌ఎచే నగదు పురస్కారాన్ని అందుకుంటున్న విద్యార్థి

ప్రతిభా విద్యార్థులకు నగదు పురస్కారం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులలో అత్యధిక ప్రతిభ కనబరిచిన 25 మంది ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడంతో ఎంఎల్‌ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి స్థాపించిన ట్రిపుల్ ఐటీలను పేద విద్యార్థుల కోసం స్థాపించారన్నారు. సీట్లు సాధించిన 25 మంది విద్యార్థులకు రూ.5 వేల చొప్పున నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు రాజవరం విద్యార్థులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-17 కోకో పోటీలకు మండలంలోని రాజవరం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు బి.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. తాడేపల్లిగూడెంలో శుక్రవారం జరిగిన ఎంపిక పోటీల్లో తమ విద్యార్థులు ఎస్.రాజు, సయ్యద్ షరీఫ్, కె.దయ, సత్యసాయి, ఎ.దేవకి, వై.తులసి ప్రతిభ కనబరిచారని వివరించారు.

ఎంఎసి ఇన్‌ఛార్జి సెక్రటరీగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఇన్‌ఛార్జి సెక్రెటరీగా ఎం.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇప్పటివరకు సెక్రెటరీగా పనిచేసిన యు.మహాలక్ష్మి ఏలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి బదిలీ అయ్యారు. పూర్తి అదనపు బాధ్యతలతో నియమితులైన శ్రీనివాసరావు గతంలో కూడా ఇన్‌ఛార్జి సెక్రెటరీగా వ్యవహరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తానని తెలిపారు.

శాశ్వత లోక్ అదాలత్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రజాప్రయోజిత సేవల శాశ్వత లోక్ అదాలత్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలని అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో అధికారులతో అదాలత్ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ అదాలత్ పట్ల ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని, విద్య, వైద్య, పోస్టల్, బీమా, రియల్ ఎస్టేట్, రవాణా, పారిశుధ్యం, బ్యాంకింగ్, ఎస్‌ఆర్‌ఇజిఎస్, టెలికం సేవల్లో లోపం జరిగితే శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చని, ఈ విషయంపై సంబంధిత అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

గోగుంటలో న్యాయవిజ్ఞాన సదస్సు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కెకెవి.బులికృష్ణ శనివారం పెదపాడు మండలంలోని గోగుంటలో 'వివాద రహిత గ్రామం' అనే అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోగుంటను వివాద రహిత గ్రామంగా చేసేందుకు ఈ అవగాహన సదస్సును ఏర్పాటు చేశామని, గ్రామంలో ఏ విధమైన వివాదాలున్నా వాటిని తక్షణం పరిష్కారానికి కృషి చేస్తామని, ఏమైనా కేసులున్నా ప్యానెల్ లాయర్ ద్వారా మధ్యవర్తిత్వం నిర్వహించి రాజీ చేసి, వివాదరహిత గ్రామంగా ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. అలాగే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ఉచిత న్యాయాన్ని అందిస్తుందని, అర్హులైన బాధితులకు పరిహారాన్ని చెల్లించడం కూడా జరుగుతుందని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి.విజయకుమార్, మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఎస్.నరసింహమూర్తి, ఎంపిడిఒ సుర్యకుమార్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రమణ, ఎస్ఐ చల్లా కృష్ణ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా విడుదల



గొల్లగూడెంలో ఓటర్ల జాబితా ప్రదర్శన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

రాష్ట్ర ఎన్నికల సంఘం ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయడంతో నియోజకవర్గంలో మొత్తం 2,33,195 మంది ఓటర్లు ఉన్నట్లు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. వీరిలో పురుషులు 1,15,665 మంది, మహిళలు 1,17,519 మంది, థర్డ్ జండర్ 11 మంది ఉన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే డిసెంబర్ 9వ తేదీ లోపు తెలియజేయాలన్నారు. వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించి జనవరి 5వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని తెలిపారు.

ఉంగుటూరు:ఓటర్ల ముసాయిదా జాబితాలను ప్రతీ ఓటరూ, రాజకీయ పక్షాలు సరిచూసుకుని అందులో ఏమైనా అభ్యంతరాలు, సవరణలు ఉంటే సంబంధిత దరఖాస్తులు అందజేయాలని నియోజకవర్గ ఓటు నమోదు సహాయ అధికారి, తహశీల్దారు ఎవి రమణారావు తెలిపారు. శనివారం అన్ని పోలింగు కేంద్రాల్లో ముసాయిదా జాబితాలను బూత్ లెవెల్ అధికారులు ప్రదర్శించారు. గొల్లగూడంలో బిఎల్‌ఒ ఉంద్రాజవరపు చంద్రబాబు సచివాలయంలో లిస్టును ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి యాళ్ల కిషోర్‌బాబు, గ్రామస్థులు, వివిధ రాజకీయ పక్ష నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న పోలీసు అధికారి

యువత రక్తదానం చేయాలి : ఎఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రక్త దానం చేసి మరొకరికి ప్రాణదానం చేసిన వారుగా యువకులు ఉండాలని, ఆపదలో ఉన్న వారికి రక్తదానం, ప్రాణదానం చేయడం రెండు ఒకటేనని జిల్లా అదనపు ఎస్‌పి భాస్కరరావు అన్నారు. పోలీసులు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఏలూరులోని సురేష్ చంద్ర బహుగుణ పోలీసు పాఠశాల ప్రాంగణంలోని కళ్యాణ మండపంలో శనివారం పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని ప్రారంభించిన భాస్కరరావు మాట్లాడుతూ రక్తదాతలు అభినందనీయులని, తలసేమియా బాధిత చిన్నారులకు, రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు శస్త్రచికిత్సల సమయంలో రక్తం ఎంతో అవసరమవుతుందని తెలిపారు. స్వచ్ఛందంగా అందరూ రక్తదానం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అనంతరం పోలీసులు, ఏలూరు ఇంజినీరింగ్ కళాశాల, ఆదిత్య కళాశాల విద్యార్థులు, ఆటో యూనియన్ సభ్యులు రక్తదానం చేశారు. వైద్య శిబిరంలో పలువురు పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. భాస్కరరావు, తదితర పోలీసు అధికారులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు యూనిట్ వైద్యులు శ్రావణ్ కుమార్, రెడ్ క్రాస్ సొసైటీ వైద్యులు వరప్రసాదరావు, సర్వజన ఆసుపత్రి వైద్యురాలు పావని, పలువురు వైద్యులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - చింతలపూడి

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కన్వీనర్ రాయంకుల లక్ష్మణరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఉర్లగూడెం, కనిపెడ, బాలవారిగూడెం తదితర గ్రామాలలో ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో పంటలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావంతో మండలంలో 250 ఎకరాలు పూర్తిగా వరిపంట ఎండి పోవటంతో పొలాల్లో పశువులను మేతగా మేపారని తెలిపారు. సాగు చేసిన రైతులు ఆర్థికంగా ఎకరాకు రూ.25 వేల పెట్టుబడి పెట్టగా, పూర్తిగా దెబ్బతిందన్నారు. పంటనష్టం జరిగిన రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని తెలిపారు. తదుపరి రాబోవు ఖరీఫ్‌కు చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేసి పై తెలిపిన గ్రామాలకు సాగునీరు శాశ్వత ప్రాతిపదికగా అందించాలని కోరారు. ఈ పర్యటనలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ, రైతు నాయకులు తక్కెలపాటి ప్రసాద్, తాడిగడప మాణిక్యాలరావు, ఎస్‌కె.జాని, తదితరులు పాల్గొన్నారు.



ఎండిన వరిపంటను పరిశీలిస్తున్న నాయకులు

లిటిల్‌ఫ్లవర్స్ విద్యార్థులకు మోడీ ప్రశంసలు



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

పరీక్షా పే చర్చా కార్యక్రమంలో భాగంగా విలువైన అభిప్రాయాలను తెలిపినందుకు గాను తమ స్కూల్ విద్యార్థులు దేశ ప్రధాని నరేంద్రమోడీ ప్రశంసలు అందుకున్నట్లు ముదినేపల్లి లిటిల్‌ఫ్లవర్స్ స్కూల్ ప్రిన్సిపల్ బలుసు రఘురామయ్య శనివారం తెలిపారు. తమ స్కూల్ విద్యార్థులు గుంట్యాడ రవికిరణ్, పేరుబోయిన ఉషా, యర్రంశెట్టి రేష్మ, మత్తి దివ్యశ్రీలు ప్రధాని కార్యాలయం నుంచి ప్రశాంసా పత్రాలు అందుకున్నారన్నారు. విద్యార్థుల్లో పరీక్షల పట్ల భయాన్ని, ఒత్తిడిని నివారించేందుకు ఐదు అంశాలపై మోడీ ఈఏడాది జనవరిలో 27న పరీక్ష పే చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులు సహకారంతో తమ ఆలోచనలు ప్రధానితో పంచుకున్నారు. అందుకు గాను విద్యార్థులకు పిఎంఒ కార్యాలయం నుంచి ఈ ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు రఘురామయ్య తెలిపారు. ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులను ఆద్యాపకులు, స్కూల్ సిబ్బంది అభినందించారు.

గుర్తుకొస్తున్నాయి..!



మరో ఆరు నెలల్లో ఎన్నికలు జరగనున్న తరుణంలో నేతలకు ఫీవర్ మొదలైంది. అధికార పక్ష ప్రజాప్రతినిధులు వీలైనంత వరకూ జనంలో ఉండే ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికే ప్రభుత్వం గడపగడపకూ మన ప్రభుత్వం, జగనన్న ఆరోగ్య సురక్ష అంటూ పలు కార్యక్రమాలు చేపట్టిన సంగతి తెలిసిందే. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ఎంఎల్‌ఎలు ఎక్కువగా హాజరు కావడం, ఆపై శిబిరం పూర్తయ్యే వరకూ అక్కడే ఉండి అందరినీ పలుకరించి ప్రభుత్వ పథకాల ప్రచారానికి వేదికగా ఉపయోగించుకోవడం ఎక్కువగా కన్పిస్తోంది. దీంతోపాటు ప్రస్తుత సమస్యలతోపాటు గతంలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను జనం ప్రస్తావించగానే 'గుర్తున్నాయి' అంటూ నేతలు సమాధానమిస్తున్నారు. రెండు సంవత్సరాలు కరోనా ఇబ్బందుల వల్ల ఇచ్చిన హామీలన్నీ అమలు చేయలేకపోయామని సర్ది చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయినా ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద మీకు ఇంత సొమ్ము అందిందిగా అని ముక్తాయించి ఈసారి గెలవగానే ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామంటూ ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. అయితే రోడ్లు, తాగునీరు, ఉపాధి, అధిక ధరలు వంటి అంశాలపై ప్రజలు అడుగుతున్న ప్రశ్నలను నేతలు నీళ్లు నములుతున్నారు. రెండు జిల్లాల్లో రోడ్ల వ్యవస్థ అధ్వానంగా మారిన సంగతి తెలిసిందే. సిఎం జగన్ సాక్షాత్తూ గడువులు ప్రకటిస్తున్నా రోడ్ల స్వరూపం మారకపోవడం ఈ ప్రభుత్వానికి మాయని మచ్చగా మారింది. ఇక మెట్టలో తాగునీటి సమస్య, డెల్టాలో కలుషిత నీటి సమస్య వెంటాడుతున్నాయి. వాటర్ గ్రిడ్ పథకం ద్వారా తొలుత పట్టణాలకు గోదావరి నీటిని అందించి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని నేతలు ప్రకటించినా అది కార్యరూపం దాల్చలేదు. ప్రధానంగా తరచూ ప్రతిపాదనలు మార్చడం, నిధులు మంజూరయ్యాయని ప్రకటించడం మినహా క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభం కాని దుస్థితి నెలకొంది. ఫలితంగా డెల్టా వాసులు నిరంతరం తాగునీటిని కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కలుషిత నీటిని తాగిన పేదలు రోగాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. ప్రధానంగా కేన్సర్ కేసులు పెద్దసంఖ్యలో డెల్టాలో నమోదవుతుండడం ఆందోళనకర అంశంగా ఉంది. ఉపాధి లేమి, అధిక ధరలు జనానికి భారంగా పరిణమించాయి. ఇప్పటికీ యువత గ్రామీణ ప్రాంతంలో పనుల్లేక పట్టణాలకు రోజూ వచ్చి దుకాణాల్లో పని చేయడం చేస్తున్నారు. దీనికితోడు ఆకాశాన్నంటిన ధరలు ఇబ్బందికరంగా పరిణమించాయి. విద్యుత్ ఛార్జీల భారం హాట్ టాపిక్‌గా మారింది. ఎక్కడికెళ్లినా దీనిపై ప్రశ్నలు తప్పడం లేదని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు తలలు పట్టుకుంటున్నారు. దీనికితోడు స్థానికంగా ఇచ్చిన హామీలు, పేరుకుపోయిన సమస్యలు నేతల తలకు చుట్టుకుంటున్నాయనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. దీంతో జనంలో అసంతృప్తి పారదోలేలా.. వారికి సన్నిహితంగా ఉండేలా నిరంతరం ఏదోక కార్యక్రమంలో పాల్గొంటూ జనంతో నేరుగా మాట్లాడే ప్రయత్నం చేస్తున్నారు. దీనిలో నరసాపురం, తాడేపల్లిగూడెం, భీమవరం, ఏలూరు, ఉంగుటూరు, చింతలపూడి, కైకలూరు, నూజివీడు, దెందులూరు ఎంఎల్‌ఎలతోపాటు టిడిపికి చెందిన ఉండి, పాలకొల్లు ఎంఎల్‌ఎలు ముందంజలో ఉన్నారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఎంఎల్‌ఎలు క్షేత్రస్థాయి పర్యటనలతోపాటు అధికారులతో తరచూ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ అభివృద్ధి పనులు వేగవంతం చేయడం, ప్రారంభోత్సవాల్లోనూ తలమునకలవుతున్నారు. మొత్తంగా ఆయా నియోజకవర్గాల్లో నేతలకు ఎన్నికల ఫీవర్ బలంగా సోకిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

'విహారం'లో విషాదం..!

విహార యాత్రల్లో విషాదాలు పశ్చిమగోదావరి జిల్లా తణుకు ప్రాంత ప్రజలను తీవ్ర ఆవేదనకు గురి చేశాయి. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో గోదావరిలో నీట మునిగి నలుగురు, పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలంలోని పేరుపాలెం బీచ్‌లో నీట మునిగి ముగ్గురు దుర్మరణం పాలవ్వడం అందరినీ కలిచివేసింది. వరుస సంఘటనల్లో మృతువాత పడిన వారంతా తణుకు పరిసర ప్రాంతాల వారే కావడంతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సాధారణంగా జిల్లాలో అధికారులు కార్తీక మాసంలో బీచ్‌లు, నదీ ప్రాంతాల్లోని పిక్నిక్ స్పాట్‌ల్లో హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేస్తుంటారు. పెరిగిన మానసిక ఒత్తిడి, యాంత్రిక జీవనం నుంచి బయట పడేందుకు జనం తక్కువ ఖర్చుతో పూర్తయ్యే సమీప పిక్నిక్ స్పాట్స్‌కు నిరంతరం వెళ్లడం సర్వ సాధారణమైంది. తరచూ పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పుకునే అధికారులు, ప్రజాప్రతినిధులు సామాన్యులు వెళ్లే పిక్నిక్ స్పాట్‌లపై పెద్దగా దృష్టి సారించకపోవడం జనం మృత్యువాత పడుతున్నారు. ఇప్పటికైనా గోదావరి నది ప్రాంతాలు, బీచ్‌ల్లో సౌకర్యాలు మాటెలా ఉన్నా ప్రాణాలు కోల్పోకుండా రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.

- వివిఎస్‌వి.ప్రసాద్

ప్రజాశక్తి
www.prajasakti.com

ఘనంగా జాతీయ పొగాకు దినోత్సవం

కొయ్యలగూడెం : కొయ్యలగూడెంలోని వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో జాతీయ పొగాకు దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఎన్ఎల్ఎస్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాలకు చెందిన రైతులు, రైతు ప్రతినిధులు పాల్గొని స్థానిక వర్జీనియా పొగాకు వలన గణనీయంగా రైతులు అభివృద్ధి చెందుతున్నారని, విదేశీ మారకద్రవ్యం లభిస్తుందని తెలిపారు. వేలం కేంద్రం నుంచి జాతీయ ప్రధాన రహదారి మీదుగా గణేష్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.

పిఎం జెజెబివై, ఆరోగ్యశ్రీపై అవగాహన

నూజివీడు రూరల్ : పట్టణంలో పిఎంజెజెబివై, ఆరోగ్యశ్రీ యాప్‌లను ప్రతి ఒక్కరూ తమ ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ మేరకు ఎఎన్ఎం కె.విజయకుమారి ఆధ్వర్యంలో బృందం శనివారం పట్టణములోని ఇంటింటికి వెళ్లడంతో ఆరోగ్యశ్రీ యాప్ ప్రయోజనము, తక్షణమే అందే వైద్య సేవలపై ప్రజలకు వివరించారు. ప్రతిఒక్కరూ తమ ఫోన్లో ఈ యాప్‌ను కలిగి ఉండాలని వైద్య బృందం తెలిపారు.

31న జాబ్ మేళా

నూజివీడు రూరల్ : ఏపి నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 31 వ తేదీన ఉదయం 9 గంటలకు నూజివీడులో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు తెలిపారు. 12 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొంటున్నాయని తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, జిల్లా అధికారి గంటా సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాగంటి బాబు

చంద్రబాబును సిఎం చేయడమే లక్ష్యం : మాగంటి

నూజివీడు రూరల్ : చంద్రబాబు సిఎం కావడమే ప్రతీ కార్యకర్త లక్ష్యం కావాలని మాగంటి బాబు తెలిపారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద భవిష్యత్తు గ్యారంటీ పేరిట శనివారం నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ చంద్రబాబును సిఎం చేయడానికి ఇప్పటి నుండే ప్రణాళిక బద్ధంగా ఐక్యమత్యంతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు టిడిపి ఇన్‌ఛార్జి ముద్రబోయిన వెంకటేశ్వరరావు, టిడిపి శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇ - క్రాప్ జాబితా విడుదల

నూజివీడు రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఇ - క్రాప్ పంట నమోదు జాబితాను మండల వ్యవసాయ శాఖ అధికారిని ఎ.చాముండేశ్వరి విడుదల చేశారు. మండల పరిధిలోని ముక్కొల్లుపాడు, పోలసానపల్లి, తదితర గ్రామాల్లో ఈ జాబితాను పంచాయతీ సచివాలయాల్లో ప్రదర్శించారు. ఈనెల 29వ తేదీలోగా ఈ జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని ఆమె రైతులకు విజ్ఞప్తి చేశారు.

పలు ప్రాంతాల్లో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

పోలవరం : మండలంలోని గడ్డపల్లి, గిన్నెపల్లి, తంగేడు కొండ, ధార్వాడ, మారుమూల గ్రామాల్లో గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పాల్గొన్నారు. అనంతరం ఎంఎల్ఎ జగనన్న ప్రవేశపెట్టిన పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మన ప్రభుత్వం వచ్చిన తరువాత ఎంత అభివృద్ధి చేకూరిందో తెలియజేస్తూ, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, జెడ్‌పిటిసి కలుం హేమ కుమారి, ఇఒపిఆర్‌డి, అధికారులు, మండల సమైక్య ఎపిఎం, సచివాలయ సిబ్బంది, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : ప్రజా సంక్షేమమే అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. శనివారం గడపగడపకు మన ప్రభుత్వం నియోజకవర్గంలో ప్రారంభించిన 200 రోజులు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీ జంగారెడ్డిగూడెంలో లింగపాలెం నుండి జంగారెడ్డిగూడెం వరకు నిర్వహించిన బైక్ ర్యాలీ జంగారెడ్డిగూడెంకు గంగానమ్మ గుడి సెంటర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎంఎల్ఎ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, ఎంపిపి కొదమ జ్యోతి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పేకాట శిబిరంపై దాడి
ఏడుగురు అరెస్టు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని స్వర్ణవారిగూడెం శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు శనివారం ఎస్ఐ, సిబ్బంది కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.6,810 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం అక్రమ విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అక్రమంగా మద్యం నిల్వ ఉంచి ఆపై అక్రమ వ్యాపారం చేస్తున్న వ్యక్తిని ఏలూరు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ప్రతికోళ్లలంకలో జయమంగళ లక్ష్మి నారాయణ తన ఇంట్లో మద్యం అమ్ముతున్నాడని సమాచారం రావటంతో ఎస్ఐ రాజారెడ్డి తమ సిబ్బందితో వెళ్లి శనివారం దాడి చేశారు. ఇంట్లో తనిఖీలు చేసి మొత్తం మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేరానికి పాల్పడిన రమేష్‌ను అరెస్టు చేశారు.

తల్లిదండ్రుల చెంతకు చిన్నారులు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఇద్దరు చిన్నారులు తమ తల్లిదండ్రుల వద్ద నుంచి తప్పిపోయి ఇద్దరు చిన్నారులను పోలీసుల తిరిగి అప్పగించిన ఘటన ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక చోడిదిబ్బకు చెందిన సుమారు 8, 9 సంవత్సరాల వయసున్న ఇద్దరు బాలలు ఈనెల 27 మధ్యాహ్నం నుంచి కనిపించకపోవటంతో వారి తల్లిదండ్రులు వెతికారు. అయినా ప్రయోజనం లేకపోవటంతో శనివారం మధ్యాహ్నం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న సిఐ చంద్రశేఖరరావు వెంటనే స్పందించి బాలలను వెతికేందుకు రెండు బృందాలను రంగంలోకి దింపారు. ఎస్ఐ శుభశేఖర్, వారి సిబ్బంది ఎట్టకేలకు బాలలను కనిపెట్టి పోలీసు స్టేసన్‌కు తీసుకువచ్చి, అనంతరం వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

వ్యక్తిపై వరకట్న వేధింపుల కేసు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

భార్య జీతంపై ఆధారపడి బతకడమే కాకుండా ఆమెను అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై, అతని తల్లిదండ్రులపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన నవ్యకు, పైలా భరత్కు 2022లో వివాహమైంది. వివాహ సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. నవ్య సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా ఉద్యోగం చేస్తుంది. దీంతో బాధితురాలు దిశ పోలీసులను ఆశ్రయింటడంతో ఆమె ఫిర్యాదు మేరకు భర్త భరత్, అతని తల్లిదండ్రులు శైలజ, కేశవరావు, ఆడపడుచు దివ్య పై వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు.

సంపద తయారీపై దృష్టి సారించండి


ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు

ప్రజాశక్తి - మండవల్లి

పర్యావరణాన్ని పెంపొందించే విధంగా మొక్కలను నాటకపోగా, చెత్తతో కలిపి మొక్కలను తగలబెట్టేయడం పంచాయతీ అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తుందని, సంపద తయారీపై దృష్టి సారించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు విమర్శించారు. మండల కేంద్రమైన మండవల్లి సంపద కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. సంపద కేంద్రం వద్ద చెత్తతో పాటు స్వచ్ఛంద సంస్థలు నాటిన పచ్చని మొక్కలు తగలబడిపోవడం ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన ఆవేదన చెందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుధామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండవల్లిలోని పలుచోట్ల ప్రభుత్వ కార్యాలయం వద్ద మొక్కలను నాటి వాటికి ట్రీ గార్డులను ఏర్పాటు చేసి సంరక్షించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా సంపద కేంద్రం వద్ద కూడా మొక్కలను నాటి ట్రీ గార్డులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సంపద కేంద్రానికి చెత్తను తరలించి పంచాయతీకి ఆదాయం సమకూర్చే విధంగా ఎరువు తయారు చేయకుండా, పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, చెత్తను తగుల పెట్టేయడం దారణమన్నారు. ఆ చెత్తతో పాటు సుధామ ఫౌండేషన్ వారు నాటిన మొక్కలు కూడా తగలబడి పోతుంటే పంచాయతీ అధికారులు చూస్తూ ఉండడం మరింత దారుణమన్నారు. పర్యావరణ సమతుల్యతను పెంపొందించేందుకు కృషి చేయాల్సిన అధికారులు ఈవిధంగా చేయడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న ప్రాంతంలోనే చెత్తతో పాటు మొక్కలు తగలబడి పోతుంటే ఏ అధికారి పట్టించుకోకపోవడంతో ఇంక ప్రజలకు ఏం సందేశం ఇస్తారని ఆయన ప్రశ్నించారు. చెత్త ఉన్నది సంపద తయారు చేసుకోవడానికేనని, తగులబెట్టేందుకు కాదని జిల్లా ఉన్నతాధికారులు పలుమార్లు హెచ్చరికలు చేసి, సోకజ్ నోటీసులు జారీ చేసిన మండవల్లి పంచాయతీ అధికారుల తీరు మారకపోవడం బాధాకరమన్నారు. అంతేకాకుండా మండలంలోని పలు గ్రామాలలో చెత్త సంపద కేంద్రాలకు తరలించకపోగా రోడ్ల పక్కన వేసి తగుల పెట్టేస్తున్నారన్నారు. అందువల్ల కాలుష్యం పెరిగిపోయి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు సంపద కేంద్రాలపై దృష్టి సారించి పంచాయతీలకు ఆదాయం సమకూర్చే విధంగా సంపద తయారీకి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల అధ్యక్షులు అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - చింతలపూడి


చింతలపూడిలోని సురక్షలో కమిషనర్ రాంబాబు

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరు ఉపయోగించుకోవాలని చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్ ఎన్.రాంబాబు తెలిపారు. నగర పంచాయతీలోని సుబ్బారాజు ప్రభుత్వ హైస్కూల్ వద్ద శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గంథం చంటితో కలసి అంగన్‌వాడీ స్టాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు జగనన్న సురక్ష కార్యక్రమానికి వచ్చి ఉచిత వైద్య సేవలు, మందులను ఉపయోగించుకోవాలని, అవసరమైన వారికి ఇసిజి కూడా నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్క కుటుంబానికి మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

చొప్ప రామన్నగూడెంలో అధికారులకు సన్మానం

కొయ్యలగూడెం : మండలంలోని చొప్ప రామన్నగూడెంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. శనివారం ప్రభుత్వంలోని వివిధ శాఖల అధికారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పాసం నాగమణి, ఎంపిడిఒ ఆర్.బేబీ, శ్రీలక్ష్మిల ఆధ్వర్యంలో పనిచేసిన అధికారులకు సిబ్బంది, ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

నూజివీడు రూరల్ : మండలంలోని సిద్ధార్థ నగర్‌లో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపిపి ఆరేపల్లి శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాన్ని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, అవసరమైన వారికి కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : జగనన్న ఆరోగ్య సురక్ష పేదలందరికీ ఆరోగ్య భరోసా అని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కొరగుంటపాలెంలో గ్రామ సచివాలయం పరిధిలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎన్ఆర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఆర్‌వివి.సత్యనారాయణ, వైస్ ఎంపిపిలు సిహెచ్.సునీత, ఆర్.రాధా, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, కోరగుంటపాలెం, అల్లూరు, ఈడేపల్లి సర్పంచిలు పేరం రామకృష్ణ, శీలం రామకృష్ణ, అబ్బిశెట్టి వెంకటేశ్వరరావు, గ్రామ సొసైటి ఛైర్మన్ అచ్యుత రాంబాబు పాల్గొన్నారు.

ఎంపీ గోరంట్ల వ్యాఖ్యలకు టిడిపి ఖండన

ముసునూరు : ఎంపీ గోరంట్ల మాధవ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తూ శనివారం మండల కేంద్రమైన ముసునూరులో రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు, రాష్ట్ర బిసి సెల్ టిడిపి కార్యనిర్వహణ కార్యదర్శి మానురాజు సురేష్, నియోజకవర్గ తెలుగు యువత కార్యనిర్వహణ కార్యదర్శి కొండేటి బాబిల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును జైల్లో చంపాలని ప్రమత్నిస్తున్నారని ఎంపీ మాటలు బట్టి అర్థమవుతుందన్నారు. న్యాయ స్థానాలు ఇప్పటికైనా కళ్లు తెరిచి చంద్రబాబు నాయుడికి ఎటువంటి ప్రాణహాని లేకుండా చూడాలని కోరారు. గోర్లంటి మాధవ్ ఒళ్లు దగ్గర పెట్టికుని మాట్లాడకపోతే తగిన బుద్ధి చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిసిసెల్ కార్యదర్శి నరిసింహారావు, సుహాసినీ పాల్గొన్నారు.

ధాన్యం సేకరణపై అవగాహన

ఉంగుటూరు : ఖరీఫ్‌లో ధాన్యం సేకరణలో తీసుకోవాల్సిన చర్యలు, తేమ శాతం ఎలా లెక్కించాలో ఉంగుటూరు తహశీల్దారు ఎవి రమణారావు, మండల వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్ శనివారం అవగాహన కల్పించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సిబ్బంది, పిఎస్ఎ, డిసిఎంఎస్ ఇన్‌ఛార్జులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సాంకేతిక సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా తేమ శాతం నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. రైతులకు గోనె సంచులు ఇవ్వడం, ట్రక్ షీట్ జనరేట్ చేయడం, వాహనాలకు జిపిఎస్ ట్యాగింగ్ తదితర అంశాలపై ప్రభుత్వ నిబంధనల గురించి వివరించారు. తేమ శాతం 17 శాతం ఉన్న ధాన్యాన్నే సేకరించాల్సి ఉందన్నారు. కామన్ రకం క్వింటాల్ రూ.2,183, గ్రేడ్-ఏ రకానికి రూ.2,203 మద్దతు ధర ఇవ్వనున్నమన్నారు. ఈ సమావేశంలో నారాయణపురం, బాదంపూడి, ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యపై అవగాహన

ఉంగుటూరు : విద్యా వ్యవస్థలో లోటు పాట్లు గమనించడం ద్వారా గుణాత్మకమైన విద్యను అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రాష్ట్ర విద్యా ప్రగతి అంచనా పరీక్ష నిర్వహణపై నారాయణపురం అరవింద శతజయంతి డిగ్రీ కళాశాల విద్యార్థులకు శనివారం మధ్యాహ్నం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

మండల స్థాయిలో నిర్వహించబడుతున్న ఈ సర్వేకు డిగ్రీ కళాశాల విద్యార్థులు క్షేత్రస్థాయి పరిశీలకులుగా వ్యవహరిస్తారు. కళాశాల ప్రిన్సిపల్ టి.విశ్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన శిక్షణా కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు విద్యార్థులకు తగు సూచనలు చేశారు. నవంబర్ 2 న ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు వారికి కేటాయించిన పాఠశాలలకు వెళ్లి పరీక్షకు సంసిద్ధత పరిశీలించుకోవాలన్నారు. మూడో తేదీ రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 10.30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని ఎంఇఒ తెలియజేశారు. స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో ప్రశ్నా పత్రాలను తీసుకుని పాఠశాల స్థాయిలో పరీక్ష నిర్వహించిన తదుపరి తిరిగి స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో పూర్తి చేసిన ప్రశ్న పత్రాలను అందజేయాలన్నారు. అనంతరం స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల సమక్షంలో ఆ కవర్లను సేల్ చేసి జిల్లాకు పంపించాలని కోరారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌కు సహకారంగా సిఆర్‌పిలు, మండల విద్యాశాఖ అధికారి, హెచ్ఎం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తారని తెలియజేశారు.

'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి'ని విజయవంతం చేయాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎఎల్ఎ మేకా

ప్రజాశక్తి - ముసునూరు

ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి.. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పరావు పిలుపునిచ్చారు. శనివారం మండలకేంద్రమైన ముసునూరులో జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, మండల వైసిపి అధ్యక్షులు మూల్పురి నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో మళ్లీ మన ఆంధ్రాకు జగనే ముఖ్యమంత్రి కావాలంటూ ఇంటింటా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ నవరత్నాల పేరిట పేద, బడుగు, బలహీన వర్గాల వారికి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అందరిని ఆదుకున్న ముఖ్యమంత్రి జగన్ అని కొనియాడారు. మండలంలోని 16 గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి మళ్లీ జగనే ఎందుకు కావాలో వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి ఎంపిపి కోటగిరి రాజానాయన, వైస్ ఎంపిపి-2 పాముల గంగధరరావు, సర్పంచులు పేరం కృష్ణ, చలసాని దామెదరరావు, కంచర్ల వాణీ, వైసిపి నాయకులు కంబాల రాంబాబు, కంబాల దాసు, రాపర్ల సుబ్బారావు, రేగుల గోపాలకృష్ణ, వైసిపి మండల యూత్ అధ్యక్షులు గూట్రు రంగరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాహితపై వాలంటీరు అకృత్యం..

గర్భవతిని చేసిన వైనం
యువతి ఫిర్యాదుతో అరెస్ట్

ప్రజాశక్తి - పోలవరం

వివాహితపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడి, గర్భవతిని చేసి మోసం చేయడానికి ప్రయత్నించిన వాలంటీర్ అరెస్ట్ అయిన సంఘటన పోలవరం మండలం పట్టిసీమలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పోలవరం పంచాయతీ కొత్త రామయ్య పేటకు చెందిన యువతికి పట్టిసీమకు చెందిన యువకుడితో వివాహం అయ్యింది. ఇద్దరు సంతానం కూడా కలిగారు. సంతానం అవసరం లేదనుకున్న భర్త గత రెండేళ్ల క్రితం వేసెక్టమీ ఆపరేషన్ చేయించుకున్నాడు. సదరు యువతి ఓ ప్రైయివేట్ కార్యాలయంలో ఉద్యోగం చేస్తుండగా, పట్టిసీమ గ్రామానికి చెందిన వాలంటీర్ మండిగ సత్య గణేష్ కార్యాలయానికి వెళ్లి తరచూ వేధింపులకు గురి చేసేవాడు. దీంతో లొంగిపోయిన యువతి గర్భవతి అని తెలియడంతో భర్త నిర్ఘాంతపోయాడు. ఆపరేషన్ చేయించుకున్నా గర్భం ఎలా వచ్చిందని ఆరా తీయగా సదరు వాలంటీర్ ఆ యువతిని భయభ్రాంతులకు గురిచేసి పలుమార్లు అత్యాచారం చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న భర్త ఆమెకు విడాకులు ఇస్తానని, విడిపోతానని హెచ్చరించడంతో ఆ యువతి సదరు వాలంటీర్ వద్దకు వెళ్లి పెళ్లి చేసుకోవాలని కోరింది. అతను పెళ్లికి నిరాకరించడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసులో రాజీ యత్నానికి అధికార పార్టీ మండలస్థాయి నాయకుడు ప్రయత్నించి విఫలమయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. అధికార పార్టీపై మచ్చ పడుతుందనే ఉద్దేశంతో సదరు వాలంటీర్‌ని ఏనాడో విధుల నుంచి తొలగించామని అధికారులు, రాజకీయ నాయకుల ఒత్తిడితో ప్రకటించినట్లు ప్రచారాలు కొనసాగుతున్నాయి.

చంద్రబాబు విడుదల వరకూ పోరాటం : టిడిపి

ప్రజాశక్తి - ఉంగుటూరు

రిమాండు ఖైదీగా ఉన్న మన నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బయటకువచ్చేంత వరకూ కార్యకర్తలు, నాయకులు పార్టీ పిలుపు మేరకు పోరాటం సాగించాలని ఏలూరు పార్లమెంటరీ అధ్యక్షుడు, మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు తెలిపారు. శనివారం రాత్రి నారాయణపురంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తలు, నాయకులు, అభిమానుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకరరావు మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టు తదనంతర పరిణామాలను ప్రజలకు వివరిద్దామన్నారు. ఈ సమావేశంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి, మండల పార్టీ అధ్యక్షుడు పాతూరి విజయకుమార్, మండల కార్యదర్శి ఆనంద్, ఇమ్మణి గంగాధరరావు వెల్లడించారు.

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశానికి నియోజకవర్గం పరిశీలకులు పోతుల అన్నవరం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ', ఓటర్ వెరిఫికేషన్, టెలిగ్రాం బాట్ రిజిస్ట్రేషన్, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలు, నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శీలం వేంకటేశ్వరరావు, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు పారేపల్లి రామారావు, జిల్లా పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ యంట్రప్రగడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : జైల్లో ఉన్న చంద్రబాబు నాయుడుకి ప్రాణహాని ఉందని టిడిపి నాయకులు అదరూ ఆందోళన గురవుతున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అన్నారు. శనివారం స్థానిక ఆలపాటి గంగాభవాని కళ్యాణ మండపంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ పరిశీలకులు కోళ్ల నాగేశ్వరావు అధ్యక్షతన నియోజకవర్గస్థాయి టిడిపి విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మాగంటి బాబు, గంటా మురళి, సీనియర్ నాయకులు మండవ లక్ష్మణ్ రావు, జగ్గవరపు ముత్తారెడ్డి, దాసరి శేషు, పరిమి సత్తిపండు పాల్గొన్నారు.

చాట్రాయి : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి అవినీతి మరక అంటించాలనే ఉద్దేశంతో తప్పుడు కేసులు పెట్టి ప్రభుత్వం జైలుకు పంపిందని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ వెంకటేశ్వరరావు తెలిపారు. బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా శనివారం చాట్రాయి మండలం కృష్ణారావు పాలెం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ బాబు అక్రమ అరెస్టు వివరించారు. ఇందులో భాగంగా జరిగిన రచ్చబండలో ఆయన మాట్లాడుతూ టిడిపి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. రానున్న ఎన్నికల్లో అరాచక వైసిపి పాలనను అంతం చేసి టిడిపిను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి చెమట బోయిన పుల్లారావు, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల సాధనకు ఎఐటియుసి కృషి

ప్రజాశక్తి - చింతలపూడి

ఎఐటియుసి 104వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించాలని ఎఐటియుసి చింతలపూడి ఏరియా అధ్యక్షులు తొర్లపాటి బాబు పిలుపునిచ్చారు. పట్టణంలో శనివారం స్థానిక సిపిఐ కార్యాలయం నందు ఎఐటియుసి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పి.మల్లేశ్వరి అధ్యక్షత వహించగా బాబు మాట్లాడుతూ స్వతంత్రానికి పూర్వమే ఏర్పడిన ఎఐటియుసి ఆనాడు కార్మిక హక్కులతో పాటు భారతదేశానికి సంపూర్ణ స్వతంత్రం కావాలని కోరిన ఏకైక కార్మిక సంఘం ఎఐటియుసి అని తెలిపారు. కార్మిక వర్గాన్ని స్వతంత్ర పోరాటంలో భాగస్వాములు చేయడంలో ఎఐటియుసి కృషి ఎంతైనా ఉందన్నారు. ఆనాడు సాధించుకున్న 44 కార్మిక చట్టాలను ఈనాటి మతోన్మాద బిజెపి ప్రభుత్వం రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందన్నారు. ఈ లేబర్ కోడ్లు రద్దు అయ్యేంత వరకు కార్మిక వర్గం పోరాడాలని తెలిపారు. ఈనెల 31వ తేదీన ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎఐటియుసి నాయకులు గంధం అంజమ్మ, విజయలక్ష్మి, అప్పారావు, వెలగాడి అనురాధ, ఎస్‌కె.యాకు, సిపిఐ మండల కమిటీ సభ్యులు దంతా కృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ మీటరు రీడర్ల బైక్ ర్యాలీని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

సమస్యల పరిష్కారంకు విద్యుత్ మీటర్ రీడర్స్ చేపట్టిన బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి ఎస్‌కె.సుభాషిని పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో విద్యుత్ మీటర్ రీడర్ బైక్ ర్యాలీలో పాల్గొనడానికి బయలుదేరిన యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాషిని మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ సోమవారం సమస్యల పరిష్కారం కోరుతూ విద్యుత్ మీటర్ రీడర్స్ బైక్ ర్యాలీ ఏలూరుకు చేరుతుందన్నారు. ఏలూరులో బైక్ ర్యాలీకి ఘన స్వాగతం పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ మేటర్ రీడర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఒ.శ్రీను, మల్లేశ్వరరావు, మురళి, కె.సురేష్ పాల్గొన్నారు.

కాపు సంక్షేమ సేన ఆధ్వర్యాన చంద్రశేఖర్‌కు సత్కారం

ఏలూరు టౌన్ : కాపు సంక్షేమసేన జిల్లా ముఖ్య సలహాదారుగా ఎంపికైన మోటేపల్లి చంద్రశేఖర్‌ను కాపు సంక్షేమ సేన నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా కాపు సంక్షేమ సేన జిల్లా అధ్యక్షులు పులి శ్రీరాములు మాట్లాడుతూ కాపుల ఐక్యతకు కృషి చేస్తున్న చంద్రశేఖర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాపు సంక్షేమ సేన ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు వాసా రాజు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట శ్రీనివాస్, ఎఐ సామర్ల వెంకటేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి వీరంరెడ్డి రమేష్, జాయింట్ సెక్రటరీ గొడవర్తి నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

11 వరకూ పదో తరగతి పరీక్షా ఫీజు చెల్లింపు గడువు

కొయ్యలగూడెం : వచ్చే ఏడాది నిర్వహించే పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష ఫీజును చెల్లించేందుకు నవంబర్ 11 వరకు గడువు విధించారని విద్యాశాఖాధికారి శ్యామసుందర్ తెలిపారు. తర్వాత చెల్లించేవారు రూ.50 అపరాధ రుసుముతో నవంబర్ 16 వరకు, రూ.200 అపరాధ రుసుముతో నవంబర్ 22 వరకు, రూ.500 అపరాధ రుసుముతో నవంబర్ 30 వరకు చెల్లించేందుకు గడువు ఇచ్చినట్లు తెలిపారు.

సుంకొల్లులో ఆలయ భూముల పరిశీలన

నూజివీడు రూరల్ : మండలంలోని సుంకొల్లు గ్రామంలో శనివారం ఏలూరు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చెన్ను రంగారావు శ్రీ వెంకటాచల స్వామివారి దేవస్థాన భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుంకొల్లు గ్రామంలో స్వామివారికి 375 ఎకరాల భూములు ఉండగా, 105 ఎకరాలకు పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చాయన్నారు. స్వామి వారి భూములలో ఆక్రమణ దారుణం తొలగించి త్వరలో స్వాధీనం చేసుకుంటామన్నారు. త్వరలో భూములను కవులు వేలం నిర్వహిస్తామని తెలిపారు.

450 పశువులకు ఉచిత వైద్య పరీక్షలు

ఉంగుటూరు : గొల్లగూడెంలో ఏలూరుకు చెందిన సోషల్ ఎడ్యుకేషన్ వాలంటరీ యాక్షన్-సేవా స్వచ్ఛంద సంస్థ ఆధర్యంలో గోద్రెజ్ ఆగ్రో వెట్ సౌజన్యంతో శనివారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. మండల పశు వైద్యాధికారి పప్పు అశోక్‌కుమార్ పశువులకు వ్యాధి నిర్ధారణ, వైద్య పరీక్షలు చేసి సేవలందించారు. సుమారు 450 పశువులకు పలు ఔషధాలు, మినరల్ దాణా మిక్చర్ పొట్లాలు గోద్రెజ్ ఆగ్రో వెట్ నిర్వాహకులు అందించారని నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కరపా వెంకట శ్రీనివాసరావు, సేవా సంస్థ కార్యదర్శి యు.రాజారావు, ఆగ్రో వెట్ అసిస్టెంట్ మేనేజర్ హేమకొండలరావు, ఇంటాస్ కంపెనీ మేనేజర్ పి.దినేష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి యాళ్ల కిషోర్‌బాబు, పాడి రైతులు, వైసిపి నాయకులు మలకలపల్లి నాగు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

ముదినేపల్లి : మండలంలోని కోరగుంటపాలెంలో రూ.43.50 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనంను శనివారం ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ప్రారంభించారు. ఆనంతరం గ్రామంలో రూ.16 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, పిఎసిఎస్ అధ్యక్షులు అచ్యుత రాంబాబు, గంటా సంధ్య, వైస్ ఎంపిపిలు సునీత, రాధా, తదితరులు పాల్గొన్నారు.